# కథ

ప్రవీణ

**అప్పుడే ఆఫీసు నుండి వచ్చి ఫ్రెష్ అయ్యి వంటింట్లోకి వెళ్ళి కాఫీ కలుపుకొని వచ్చి కంప్యూటర్ ముందు కూర్చొని తన మెయిల్ చెక్ చేసుకుంటోంది నివేదిత.**

**ఇంతలో దఢాల్న తలుపుతోసుకుంటూ లోపలికి వచ్చింది ఆమె స్నేహితురాలు భావన.**

# నిజం

''వచ్చేశావా.. ఇంకో కప్పు కాఫీ ఫ్లాస్కులో పోసి ఉంచాను. కప్పులోకి వంపుకొని తాగేసెయ్'' అన్నది ఆమె వైపు తిరిగి చూడకుండానే.

''కాఫీ సంగతి తరువాత ఈ రోజేం జరిగిందని అడగవేం'' అన్నది భావన.

''చెప్పు ఏం జరిగిందీ'' నిరాసక్తంగా అడిగింది భావన వైపు తిరుగుతూ నివేదిత.

''ఈరోజు శశాంక్ ప్రపోజ్ చేశాడు తెలుసా''

ఆమె ముఖంలో కనబడుతున్న సంతోషాన్ని మౌనంగా చూస్తూ ఉండిపోయింది నివేదిత.

''ఏయ్ నివీ ఏమిటే ఇంత గుడ్ న్యూస్ చెబితే నువ్వు ఉలకవూ, పలకవూ'' అన్నది భావన.

''ఇలాంటి న్యూస్‌లెన్ని వినలేదూ. రాహుల్ ఐలవ్యూ చెప్పాడనీ సావంత్ నువ్వు లేందే బతకలేనన్నాడనీ మహేశ్ నువ్వు పెళ్ళికి ఒప్పుకోకుంటే మేడపై నుండి దూకి చచ్చిపోతానన్నాడనీ చెప్పావు. కానీ నువ్వు పెట్టిన ప్రేమ పరీక్ష నెగ్గలేక మొహాలు చాటేశారు. ఇదీ అలాంటి కేసే అనుకుంటున్నానులే'' అన్నది తేలికగా నివేదిత.

''నివీ ఇదలా కాదు వాళ్ళందరూ నన్నిష్టపడ్డారు. కానీ శశాంక్‌ని నేను కూడా ఇష్టపడుతున్నాను. అందుకే ఇది గుడ్ న్యూస్ అని అన్నాను'' అన్నది భావన.

''అయితే నువ్వు శశాంక్‌కి నీ గతాన్ని చెప్పలేదన్నమాట'' అన్నది సంతోషంగా నివేదిత.

''ఆ విషయం చెప్పకుండా ఎలా ఉంటాను. చెప్పే వచ్చాను. అదంతా విన్న తరువాత తను ఆలోచించుకోవడానికి ఒకరోజు సమయం కావాలని అన్నాడు. ఆలోచించిన తరువాత కూడా నీ నిర్ణయం మారకుంటే ఎల్లుండి వాలెంటైన్స్‌డే రోజు కలుసుకుందాం అని చెప్పి వచ్చాను. శశాంక్ అందరిలాంటి వాడు కాడు నివీ. అతను నన్ను అమితంగా ప్రేమిస్తున్నాడు. తప్పకుండా వస్తాడు చూడు. నాకా నమ్మకం ఉంది'' అంటూనే టవల్ తీసుకుని బాత్‌రూమ్‌లోకి వెళ్ళింది భావన.

ఆమె వెళ్ళిన వైపు చూస్తూ గతంలోకి జారిపోయింది నివేదిత.

★ ★ ★

చిన్ననాటినుండీ ప్రాణస్నేహితులైన భావన, నివేదితలు ఇరుగుపొరుగిళ్ళలో ఉండేవాళ్ళు. ఎల్‌కేజీ నుండి ఇంటర్ వరకూ ఒకే స్కూలు, ఒకే కాలేజీలో చదివారు. ఇంటర్ తరువాత ఎంసెట్‌లో ర్యాంకుల తేడా వల్ల నివేదిత వైజాగ్‌లోని గీతమ్ ఇంజనీరింగ్ కాలేజీలోనూ, భావన ఆర్ఈసీ కాలేజ్ వరంగల్‌లోనూ జాయినయ్యారు. నాలుగేళ్ళ తర్వాత ఇద్దరికీ క్యాంపస్ ఇంటర్వ్యూల్లో బెంగుళూరులో జాబ్స్ రావడం వల్ల అక్కడ ఒకే అపార్ట్‌మెంట్ రెంట్‌కి తీసుకొని మూడేళ్ళుగా అక్కడే ఉంటున్నారు. వాళ్ళిద్దరి మధ్య ఎటువంటి రహస్యాలూ దాపరికాలూ లేవు.

భావన కాలేజీలో ఉన్నప్పటినుండి ఇప్పటివరకూ శశాంక్‌తోపాటుగా ఎంతోమంది అబ్బాయిలు ఆమెను ప్రేమిస్తున్నామనీ, పెళ్ళి చేసుకుంటామనీ ప్రపోజ్ చేశారు. అందం, చలాకీతనం, మంచితనం మూర్తీభవించిన భావనను వివాహమాడడానికి ఏ అబ్బాయైనా ఇష్టపడతాడు. కానీ సమస్యేమిటంటే భావనకి చిన్నప్పట్నించీ గేమ్స్ ఆడటం అంటే ఇష్టం. ఆమె ఇంటర్ ఫస్టియర్‌లో ఉండగా వాలీబాల్ టీమ్‌లో స్టేట్ లెవెల్ కాంపిటేషన్స్‌కి సెలెక్టయ్యింది. అప్పుడు ఆమె బెంగుళూరు వెళ్ళాల్సి వచ్చింది. అక్కడ ఆమె పట్ల అతి అమానుషమైన దురదృష్టకరమైన సంఘటన జరిగింది. ఆమె ఒకరోజు ప్రాక్టీస్‌కెళ్ళి వచ్చి బాగా అలిసి ఉండటంతో తనకు కేటాయించిన గదిలో అలిసిసొలిసి ఆదమరచి నిద్రిస్తున్న సమయంలో ఎవరో గుర్తు తెలియని మనిషి ఆమెని మానభంగం చేశాడు. చీకట్లో అతడెవరో కూడా ఆమె చూడలేకపోయింది. దేశంలోని నలుమూలల నుండి ఎన్నో ప్రాంతాల వాళ్ళు ఆ కాంపిటీషన్స్‌కి అక్కడికొచ్చి ఉండటం వలన ఆ పని చేసిందెవరో కనిపెట్టలేకపోయింది. ఆమె షాక్‌లో నుంచి తేరుకొని కోచ్‌కి కంప్లైంట్ ఇస్తే-

''ఎక్కడని ఎంక్వైరీ చేస్తాం, ఎవరి మీదని కంప్లైంట్ ఇవ్వగలం. ఈ విషయం బయటికి పొక్కడం నీకే మంచిది కాదు. నేరస్థుడెవరో తెలియంది మనమేమీ చెయ్యలేం. ఈ విషయాన్ని ఇలా వదిలేయడమే మంచిది'' అని ఆమెకెన్నో విధాల సముదాయించాడు. వయసులో చిన్నదయినా ఆమె అనుకోకుండా జరిగిన ఈ భయంకర సంఘటన వలన కృంగిపోయిన మనసుతో ఉన్న భావన ఆ కొత్త ప్రదేశంలో ఏమీ చెయ్యలేక కోచ్ చెప్పినట్లు విని మౌనంగా వుండిపోయింది.

ఆ సంగతి తెలిసిన కొందరు విద్యార్థులు కొద్దిరోజులు చెవులు కొరుక్కున్నారు. ఆ తర్వాత ఆ విషయాన్ని జరుగుతున్న కాలంతో పాటు అందరూ మర్చిపోయారు. కానీ భావన మనసులో ఆ అఘాయిత్యం వల్ల జరిగిన గాయం తాలూకు మచ్చ మిగిలిపోయి పీడకలలాగా ఆమెని వెన్నాడుతూనే ఉంది.

మొట్టమొదట రాహుల్ ఆమెకి ప్రపోజ్ చేసినప్పుడు గతం తాలూకు ఆ సంఘటన అతనితో చెప్తానని భావన తనతో అంటే తను వద్దని వారించింది. ఏ మగవాడైనా ఆ విషయం జీర్ణించుకోలేడనీ, మళ్ళీ ఆ సంఘటనని బయటికి తవ్వి తీసి బంగారంలాంటి భవిష్యత్తు పాడుచేసుకోవద్దనీ కోరింది. కానీ భావన వినలేదు.

భార్యాభర్తల మధ్య రహస్యాలుండటం మంచిది కాదనీ ఏనాటికైనా వేరెవరి ద్వారానో ఆ విషయం అతనికి తెలిస్తే తన పట్ల నమ్మకం స్థానాన్నే అసహ్యం కలుగుతుందనీ తను నిజాయితీగా నిజం అతనికి చెప్తే అతని ప్రేమలోని నిజాయితీ కూడా తనకు తెలుస్తుందనీ వాదించింది.

భావన మొండిమనిషి ఇక ఆమె ఎవరు చెప్పినా వినదు అని తను మిన్నకుండిపోయింది.

ఆ విషయం చెప్పిన మర్నాటి నుండీ రాహుల్, భావనను తప్పించుకుని తిరగసాగాడు. ఆ తర్వాత సావంత్, మహేశ్ వాళ్ళూ ఇలాగే చేశారు.

మరి ఈ శశాంక్ ఏం నిర్ణయం తీసుకుంటాడో చూడాలి.


కానీ శశాంక్ కాదంటే భావన తట్టుకోవడం కష్టం. ఇదివరకు ప్రపోజ్ చేసిన వారందరూ కాదన్నా భావన తేలిగ్గా తీసుకుంది. కానీ ఇప్పటి విషయం వేరు. భావన శశాంక్‌ని ఇష్టపడుతుంది.

భావనకి శశాంక్ ఆర్నెల్ల క్రితం పరిచయమయ్యాడు. తనూ భావన రోజూ మార్నింగ్ వాక్‌కి

వెళ్తారు. ఒకరోజు వాళ్ళలా వెళ్తుంటే వెనకనుండి ఎవరో పిల్చినట్లయ్యింది. వెనుదిరిగి చూస్తే పొడుగ్గా, తెల్లగా స్ఫురద్రూపి అయిన యువకుడు ట్రాక్‌సూట్ వేసుకొని నిలబడి ఉన్నాడు. అతడు రెండు మూడు రోజులుగా జాగింగ్ చేస్తూ కనబడుతున్నాడు.

కంపెనీ లేక బోరుకొడుతుందనీ అన్నాడు. అతని మాటల్లో వీళ్ళతో ఫ్రెండ్‌షిప్ చేసుకోవాలన్న కోరిక కనబడింది.

మొత్తానికి ఆ రోజునుండీ వాళ్ళు ముగ్గురూ క్లోజ్ ఫ్రెండ్స్ అయ్యారు. రోజూ ఉదయం వీళ్ళు వాకింగ్ చేసింతర్వాత అక్కడ ఆగి కాసేపు మాట్లాడుకునే వాళ్ళు. ఒక్కో సారి మాటల్లో పడి టైమే తెలిసేదికాదు.



''హలో ఐయామ్ శశాంక్ ఫ్రమ్ హైదరాబాద్, బెంగుళూరు వచ్చి వారం రోజులైంది. మీరు రోజూ వాకింగ్‌కి రావడం గమనించాను. మీ మాటల్లో తెలుగు వినబడటంతో మీతో పరిచయం చేసుకోవాలనిపించింది'' అన్నాడు.

''అయితే మీరు జాగింగ్‌కి వచ్చేది వెనకా ముందూ వెళ్ళే వాళ్ళ మాటల్ని చాటుగా విని వాళ్ళే ప్రాంతం వాళ్ళో ఇన్వెస్టిగేట్ చెయ్యడానికన్నమాట. బై ది వే ఐయామ్ భావన. షి ఈజ్ మై ఫ్రెండ్ నివేదిత. మేమూ హైదరాబాద్ వాళ్ళమే'' అన్నది భావన నవ్వుతూ.

ఆ మాటలు వినగానే అతని ముఖంలో సంతోష ఛాయలు కనిపించాయి.

''ఇఫ్ యూ డోంట్ మైండ్ మనం కాసేపు అటు పక్కకు వెళ్ళి మాట్లాడుకుందామా?'' అంటూ పార్కులో ఓ పక్కగా వేసి ఉన్న సిమెంటు బెంచీ వైపు దారితీశాడు.

అక్కడ కూర్చున్న తరువాత అతడు ఆరునెలల ట్రైనింగ్ కొరకు హైదరాబాద్ నుండి ఇక్కడికి కంపెనీవాళ్ళు పంపారనీ సుగంధ అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో ఆ కంపెనీలో పనిచేసే అతనితో షేరింగ్‌లో ఉంటున్నాననీ కొత్తప్రదేశంలో ఫ్రెండ్స్ ఎవ్వరూ లేకపోవటంతో వర్క్ అవర్స్ తరువాత

అలాంటప్పుడు ఆఫీసుకి లేటవుతుందని ఆ పార్కుకు అతి దగ్గర్లోనే ఉన్న ఉడ్‌లాండ్స్ హోటల్లో టిఫిన్ చేసి ఇంటికి వెళ్ళి గబగబా స్నానాలు ముగించుకొని ఆఫీసులకు వెళ్ళేవాళ్ళు.

సాయంత్రాలు ఎప్పుడన్నా అతడు వీళ్ళ అపార్టుమెంటుకొచ్చి కాఫీ తాగి వెళ్ళేవాడు. రాత్రి భోజనాలప్పుడు ఏవైనా స్పెషల్ ఐటమ్స్ చేసుకుంటే వీళ్ళు అతనికి పంపేవాళ్ళు. అతనుండే అపార్టుమెంట్ కాంప్లెక్స్‌కి ఎదురుగానే వీళ్ళుండే అపార్ట్‌మెంట్స్ ఉండటం వల్ల ఎప్పుడైనా సాయంత్రాలు వీళ్ళూ, అతనూ కలిసి మార్కెటుకు వెళ్ళేవాళ్ళు. ఆదివారాలు హోటల్లో లంచ్ చేసి సినిమాకి వెళ్ళి వచ్చే

వాళ్ళు. కానీ రానురానూ శశాంక్ భావన పట్ల చాలా ఇంట్రెస్టు చూపించడం నివేదిత గమనించింది. వాళ్ళిద్దరిమధ్యా తను అడ్డుగా ఉంటున్నానేమో అన్న ఫీలింగు కలుగసాగింది. అప్పుడప్పుడూ తనకేదో పని ఉందంటూ సున్నితంగా చెప్పి వాళ్ళతో వెళ్ళకుండా తప్పించుకుంటోంది. ఎప్పుడో అప్పుడు ఈ న్యూస్ వింటానని ఊహించడం వల్ల నివేదితకి పెద్ద ఆశ్చర్యం కలుగలేదు.

శశాంక్ ట్రైనింగ్ పీరియడ్ అయిపోయింది. రెండ్రోజుల్లో ఊరెళ్తున్నాడు. భావనతో పెళ్ళి విషయం తేల్చుకునేందుకే ఆగినట్లున్నాడు. ఎంతగా ప్రేమించినా ఏ మగవాడూ ఇలాంటి విషయాలు తట్టుకోలేడు. కానీ పిచ్చిభావన శశాంక్ తన కోసం వస్తాడని కలలు కంటూంది. ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే.

బాత్‌రూం డోర్ తెరిచిన శబ్దం అవడంతో ఆలోచనల్లో ఉన్న నివేదిత ఈ లోకంలోకి వచ్చింది. అప్పుడే తలస్నానం చేసి లేత గులాబీ రంగు నైటీతో అరవిరిసిన గులాబీలా ఉన్న భావనను చూసి ఆడదైన తనే దృష్టి మరల్చలేకపోతుంది.

లేత గులాబీరంగు చర్మం సన్నటి నాసిక, మెరిసే ఎర్రటి పెదవులు పై పెదవికి కాస్త పైన బ్యూటీ స్పాట్ పెట్టినట్లుగా ఉన్న నల్లటి పుట్టుమచ్చ తళతళా మెరిసే పెద్ద కళ్ళూ..ఐదడుగుల నాలుగంగుళాల హైటూ, మోడల్ లాంటి ఫిగరుతో ఎంతో అందంగా ఉంటుంది. ఆమెకు ఇంతందాన్ని ఇచ్చిన దేవుడు అలాంటి శాపం ఎందుకిచ్చాడో? దైవలీలలు విచిత్రం. ఆమె గోడకున్న వేంకటేశ్వరస్వామి పటం వంక భక్తిగా చూస్తూ-

''స్వామీ! శశాంక్ ఎలాగైనా భావనని పెళ్ళాడేటట్లుగా చెయ్యి తండ్రీ'' మనసులో అనుకొని లెంపలు వేసుకుంది భక్తితో.

★ ★ ★

ఆ రోజు ఉదయం ఇద్దరికీ ఆలస్యంగా మెలకువ రావడంతో మార్నింగ్ వాక్‌కి వెళ్ళలేదు. భావన త్వరత్వరగా రెడీ అయ్యి బ్రేక్ ఫాస్ట్ చేస్తూ ఇంకా బద్ధకంగా పడుకొని ఉన్న నివేదితను చూస్తూ

## కీలకం

**మహిమాచౌదరి సినిమా అంటే అందరికీ ఆసక్తే. ఎందుకంటే ఆమె సమ్మోహనమైన రూపాన్ని చూడడానికి ఎదురుచూస్తుంటారు జనం. అన్నట్టు తనూజా చంద్రా కూడా ఇప్పుడిలాగే ఆలోచిస్తున్నాడు. ఆయన నిర్మిస్తున్న కొత్త చిత్రం ఫిల్మ్‌స్టార్‌లో ఓ హాట్ సాంగ్ మనకి దర్శనం ఇవ్వబోతోంది. ఇంతకీ అసలు సంగతేంటంటే ఈ సాంగ్‌కి యు సర్టిఫికెట్ ఇవ్వడానికి సెన్సార్ బోర్డ్ అంగీకరించకపోవడంతో దిక్కులేక ఆ సాంగ్‌లో కొన్ని సన్నివేశాల్ని రీసెన్సార్ చేయకతప్పలేదంట. సెన్సార్ కత్తెర పడిన ఈ సాంగ్ ఎలా ఉంటుందో చూడాలని ఉంటే సినిమా విడుదలయ్యేవరకూ ఆగకతప్పదు.**



''అదేంటి ఆఫీస్‌కి వెళ్ళడం లేదా'' అనడిగింది.

''కాస్త ఆలస్యంగా వెళతాను'' అన్నది నివేదిత.

బ్రెడ్‌కి ఫ్రీజ్ స్ప్రెడ్ రాసుకొని శాండ్‌విచ్ చేసుకుంటున్న భావన ''నీకూ శాండ్‌విచ్ రెడీ చెయ్యమంటావా'' అనడిగింది.

''వద్దు నేనీరోజు కార్న్‌ఫ్లేక్స్ తింటాలే. నువ్వు తినేసి వెళ్ళు. నీకు లేటవుతుంది'' అంటూ లేచి బాత్‌రూంలోకి వెళ్ళింది.

భావన వెళ్ళిన కాసేపటికి నివేదిత తయారై ఇల్లు తాళం వేసుకొని ఆఫీసుకి కాకుండా నేరుగా శశాంక్ ఇంటికి వెళ్ళింది.

అక్కడ ఆమెకు కనబడ్డ దృశ్యం శశాంక్ ఊరెళ్ళడానికి సిద్ధమయినట్లుగా సామానంతా సర్ది ఉంది. అతడు దీర్ఘాలోచనలో మునిగి ఉన్నట్లుగా కూర్చున్నాడు.

అంటే శశాంక్ ఊరెళ్ళడానికి నిశ్చయించుకున్నాడన్నమాట. అతన్ని ఎలాగైనా ఆపాలని దృఢ చిత్తంతో అనుకుంది.

నివేదిత ఆ సమయంలో తనింటికి వస్తుందని ఊహించని శశాంక్ ఆమె వైపు కాస్త ఆశ్చర్యంగా చూశాడు.

''అయితే శశాంక్ మీరు భావన విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకున్నారు'' ఆమె డైరెక్టుగానే అడిగింది.

అతడు ఏమీ చెప్పలేనట్లుగా మౌనంగా ఉండిపోయాడు.

''శశాంక్ నేను భావన గురించి మీకో విషయం చెప్పాలి...'' ఆమె అంటూండగానే

''నాకది తెలుసు. భావన నాతో చెప్పింది'' అసహనంగా అన్నాడు.

''భావన మీతో తన గతాన్ని గురించి చెప్పిన విషయం అబద్ధమని చెప్పడానికి వచ్చాను'' అన్నది.


''ఏంటీ, అబద్ధమా'' ఆశ్చర్యంగా చూసాడామె వైపు.

''అవును. ఆమె చెప్పేది కట్టుకథ. అలాంటి సంఘటన ఆమె జీవితంలో ఎన్నడూ జరగలేదు. కానీ తనను ప్రేమించిన మనిషికి ఇలాంటి ప్రేమ పరీక్ష పెట్టి నెగ్గితీరుతానని భావనా, నెగ్గలేవని నేనూ పందెం వేసుకున్నాము. కానీ నువ్వు ఆమె చెప్పింది నిజమనుకొని వెళ్ళిపోతే భావన ఆ ఓటమి తట్టుకోలేదు శశాంక్. నా మాట నమ్ము. నువ్వు భావనని వదిలి వెళ్ళొద్దు ప్లీజ్. నేను చెప్పేది అక్షరాలా

నిజం. కావాలంటే దేవుడి మీద ప్రమాణం చేసి చెప్తాను'' అంటూ అక్కడ గోడకు వేలాడదీసిన దేవుడి పటం ముందుకు వెళ్ళి ప్రమాణం చెయ్యడానికి సిద్ధపడింది.

అతడు పరుగున వెళ్ళి ఆమెను ఆపాడు.

''వద్దు నివేదితా మమ్మల్ని కలపడం కోసం నువ్వు ఆ దేవుడి సాక్షిగా తప్పుడు ప్రమాణాలు చేసి పాపం మూట కట్టుకో వద్దు. భావన గతంలో జరిగిన సంఘటన గురించి నాకు తెల్సు). నేను ఆమెను కాదనుకోవడానికి కారణం ఆమె శీలాన్ని కోల్పోయిందని కాదు ఆమె నిజాయితీకి భయపడి'' అన్నాడు.




''అంటే'' అన్నది అర్థం కానట్లుగా చూస్తూ.

''ఆమె తన శీలాన్ని కోల్పోయిన విషయం నాతో నిర్భయంగా చెప్పి తన ప్రేమలోని నిజాయితీని నిరూపించుకుంది. కానీ ఆ అమాయకురాలి శీలాన్ని నిర్దాక్షిణ్యంగా హరించి వేసిన నేను మాత్రం నిజం చెప్పలేకపోతున్నాను'' అన్నాడతను.


అతడు అన్న మాటలకు ఆమె అయోమయంగా అతని వైపు చూస్తూ''అయితే ఆనాడు ఆ అఘాయిత్యం చేసింది మీరేనా'' అడిగింది.

''అవును నేనే. అప్పుడు నేను కూడా కాలేజీ నుండి స్టేట్ లెవెల్ కాంపిటీషన్స్‌కి బెంగుళూరు వెళ్ళాను. ఆ రాత్రి నేను ఫ్రెండ్స్ బలవంతం మీద డ్రింక్ చేయాల్సి వచ్చింది. సగం మత్తులో ఉన్న నేను అనుకోకుండా భావనకు కేటాయించిన గదిలోకి వెళ్ళాను. మరి ఆ సమయంలో భావన రూమ్మేట్‌గా ఉన్న ఇంకో అమ్మాయి ఎటెళ్ళిందో ఏమో. అక్కడ భావన ఒంటరిగా పడుకొని ఉంది. గాఢ నిద్రలో ఉన్న ఆమె ఒంటిపైని దుస్తులు చెదిరి రెచ్చగొట్టే విధంగా కనబడింది. నేను నాలో రేగిన కోర్కెను నిగ్రహించుకోలేకపోయాను. డోర్ బోల్ట్ వేసి లైట్ తీసివేశాను. ఆ రోజు చీకట్లో నేను చేసిన పాపం ఇప్పటికీ నన్ను వెన్నాడుతూనే ఉంది. ఆ తర్వాత అమ్మాయి కోచ్‌కి కంప్లైంట్ ఇవ్వడం, అతడు నచ్చజెప్పటం అన్నీ గమనించినా, నా కెరియర్ పాడవుతుందని నేను చేసిన పాపాన్ని నాలోనే దాచుకున్నాను. ఆ అమ్మాయి అమాయకమైన ముఖంలోని ఆ కళ్ళు పైపెదవి పైనున్న ఆ పుట్టుమచ్చ ఎప్పటికీ నన్ను వెన్నాడుతూనే ఉన్నాయి.

నేను ఇంటర్ అవగానే తిరుచ్చి వెళ్ళాను. అక్కడి ఆర్ఇసి కాలేజీలో నా చదువు పూర్తి చేసుకొని వచ్చాక ఆ అమ్మాయి ఇప్పుడెక్కడ ఉందో తెల్సుకోవాలని ప్రయత్నించాను. కానీ సరైన సమాచారం దొరకలేదు. నేను ఇక్కడికి ట్రైనింగ్ కోసం వచ్చిన రెండవరోజే పార్క్ వైపు జాగింగ్‌కి వచ్చాను. అక్కడ నువ్వూ భావనా కనబడ్డారు. నేను భావనను చూడగానే గుర్తుపట్టాను. అందుకే పరిచయం పెంచుకొని పెళ్ళి ప్రస్తావన తీసుకువచ్చాను. కానీ నిజాయితీగా తన పట్ల జరిగిన అవమానాన్ని వెరవకుండా నాతో చెప్పినప్పుడు, నేను కూడా అంతే నిజాయితీగా నేను చేసిన పాపం ఏమిటో చెప్పడం న్యాయం కాదా? నేను నిజం దాచి ఆమెనెలా పెళ్ళాడాలి. నిజం చెప్పిన మరుక్షణం భావన నా ముఖం చూస్తుందా. నేను ఈ డైలమాతో సతమతమవుతున్నాను. ఏం చెయ్యాలో తెలియక ప్రస్తుతానికి హైదరాబాద్ తిరిగి వెళ్ళిపోదామనుకుంటున్నాను'' అన్నాడతను.

అతడు చెప్పింది విన్న నివేదితకు కూడా ఏం సలహా ఇవ్వాలో అర్థం కాలేదు. ఇద్దరూ దీర్ఘంగా ఆలోచిస్తూ ఉండిపోయారు. ఇంతలో ఫోన్ రింగయ్యింది. ఆ శబ్దానికి ఉలిక్కిపడ్డ శశాంక్ వెళ్ళి ఫోన్ తీసి ''హలో'' అన్నాడు.

అవతలి నుండి ''హలో శశాంక్ నేను భావనని మాట్లాడుతున్నాను. హమ్మయ్య నువ్వింట్లోనే ఉన్నావా. థాంక్ గాడ్'' మృదువైన భావన కంఠం వినబడింది.




ఆమె కంఠం విన్న అతనికి గొంతులో ఏదో అడ్డం పడ్డట్లు అయ్యింది. మళ్ళీ అవతల్నించి భావన మాట్లాడింది.

''శశాంక్ నీకో విషయం చెప్దామని ఫోన్ చేశాను. నేను నిన్న నీతో చెప్పిన నా గతంలోని సంఘటన నిజం కాదు. నేను నీ ప్రేమను పరీక్షించాలని అలా కట్టుకథ అల్లి చెప్పాను. అది నిజం అని నమ్మి నువ్వు నన్ను వదిలి వెళ్ళిపోవద్దు. ప్లీజ్'' ఆఖర్న ఆమె గొంతు దుఃఖంతో పూడుకొని పోయినట్లయ్యింది.

మొదట అతనికి ఆమె ఏం చెప్తుందో ఎందుకు చెప్తుందో అర్థం కానట్లన్పించినా మరుక్షణంలో అతడు ఆమె ఎందుకలా చెప్పిందో అర్థం చేసుకున్నాడు.

అతడు ఆనందంతో వికసించిన ముఖంతో...

''భావనా ఎందుకలా కంగారు పడుతున్నావు. నిన్ను వదిలి నేనెక్కడికి వెళతాను. మనం రేపు వాలెంటైన్స్ డే రోజు కలుసుకుందామనుకున్నాం కదా. రేపు సాయంత్రం నువ్వు రెడీగా ఉండు. నేను మంచి హోటల్‌లో కాండిల్ లైట్ డిన్నర్‌కి టేబుల్ బుక్ చేసి ఉంచుతాను'' అన్నాడు.

అతడు ఫోన్ పెట్టేసింతర్వాత ''ఏమిటి మార్పు, అసలు విషయమేమిటి?'' అనడిగింది నివేదిత.

అతడు భావనకీ తనకీ మధ్య జరిగిన సంభాషణ గురించి చెప్పాడు.

''అదేమిటీ ఉన్నట్టుండి భావన అలా అబద్ధం ఎందుకు చెప్పిందీ'' ఆలోచనలో పడ్డదామె.

''ఎందుకంటే ఆమె నన్ను నిజంగా ప్రేమిస్తుంది కాబట్టి, నా ప్రేమను పొందడానికి ఆమె నిజాన్ని అబద్ధంగా మార్చింది. సో నాక్కూడా ఆమెతో నిజం చెప్పాల్సిన అవసరం లేదు. ఆమె ప్రేమను నిలుపుకోవాలంటే నేను నాలో దాగి ఉన్న నిజాన్ని సమాధి చెయ్యాలి.

వెయ్యబద్ధాలు ఆడి అయినా ఒక పెళ్ళి జరిపించాలంటారు పెద్దలు. మేం ఒక నిజాన్ని దాచి మా పెళ్ళి జరుపుకుంటున్నాం. అంతే. ఇందులో అర్థంకాక పోవడానికేముంది ఇట్స్ సో క్లియర్'' అన్నాడతడు ఆనందంగా.

ఆమెకు అతడు చెప్పింది అర్థమయ్యీకానట్లుంది.

కానీ ఏది నిజమో ఏది అబద్ధమో గానీ వాళ్ళిద్దరూ ఒకర్నొకరు అమితంగా ప్రేమించుకుంటున్నారన్నది మాత్రం 'నిజం' అనుకుంది నివేదిత.